మీటర్ రీడర్స్‌పై వివక్ష

ప్రతినెలా తొలివారంలో విద్యుత్ బిల్లులు తీసే మీటర్ రీడర్లపై కూటమి ప్రభుత్వం పచ్చపాతం చూపిస్తోంది. గత ప్రభుత్వంలో ఇచ్చే వేతనం కంటే ప్రస్తుతం చాలా తక్కువగా వస్తోందని వారు వాపోతున్నారు. దీనిపై ప్రశ్నిస్తే 'ఇచ్చినంత తీసుకొండి.. లేకుంటే వెళ్లిపొండి' అంటూ లోకేశ్ టీమ్ నేతలు చెబుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వస్తున్న స్మార్ట్‌మీటర్ల రాకతో తమ పరిస్థితి ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు.

- 'ఇచ్చినంత తీసుకొండి.. లేకుంటే వెళ్లిపొండి' అంటున్న లోకేశ్ టీమ్
- స్మార్ట్‌మీటర్ల రాకతో భవిష్యత్ ప్రశ్నార్థకం
- ఉద్యోగ భద్రత కల్పించాలని వేడుకోలు



నెల్లూరు నగరంలో రీడింగ్ తీస్తున్న మీటర్ రీడర్

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : జిల్లా విద్యుత్ శాఖలో 400 మందికిపైగా మీటర్ రీడర్స్ పనిచేస్తున్నారు. వీరు ప్రతినెలా ఇంటికి వెళ్లి రీడింగ్ తీసి విద్యుత్ బిల్లులు అందిస్తే ఒక్కో బిల్లుకు నగరాల్లో రూ.3.60 పైసలు, రూరల్‌లో రూ.3.73 పైసలు ఇవ్వాలని విద్యుత్ యాజమాన్యం సంబంధిత కాంట్రాక్టర్లకు నిర్ణయించింది. అయితే కాంట్రాక్టర్లు మాత్రం రీడర్లకు రూ.3.20 పైసలు మాత్రమే ఇస్తుండేవారు. దీంతో తమ శ్రమ దోపీడీ అవుతోందని గత ప్రభుత్వం దృష్టికి రీడర్స్ తీసుకెళ్లగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మీటర్ రీడర్లకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో వేతనాలు ఇవ్వాలని విద్యుత్ యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం గత నాలుగు నెలల నుంచి రీడర్స్‌కు బిల్లులు చెల్లించే కాంట్రాక్టరు ఒక్కరే కావడం, సదరు కాంట్రాక్టరు తాను బిల్లుకు రూ.2.80 పైసలు మాత్రమే ఇస్తానని.. ఇష్టం ఉంటే ఉండండి, లేకుంటే వెళ్లిపొండి అని బెదిరిస్తున్నట్లు రీడర్స్ వాపోతున్నారు. అదేవిధంగా నిబంధనల మేరకు నూతన కాంట్రాక్టర్ మీటర్ రీడర్స్‌కు రీడింగ్ పరికరాలు, మొబైల్ ఫోన్ ఇవ్వాల్సి ఉండగా, తాను ఇవ్వనని వాటిని రీడర్స్ సమకూర్చుకోవాలని చెబుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అభద్రతాభావంలో మీటర్ రీడర్లు

మీటర్ రీడర్స్‌కు ఉద్యోగభద్రత లేక అభద్రతా భావంతో ఉన్నారు. ఇందుకు కారణం చాలీచాలని వేతనాలతో పాటు, నూతనంగా విద్యుత్ సంస్థ ప్రవేశపెడుతున్న స్మార్ట్‌మీటర్లు మరో కారణంగా చెప్పవచ్చు. ఈ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ నెల్లూరు నగరంలో వేగవంతంగా కొనసాగుతోంది. వీటి ఏర్పాటుతో రీడర్లు ప్రతినెలా రీడింగ్ తీసి బిల్లుల ఇచ్చే పరిస్థితి ఉండదు. మొబైల్ రీచార్జి తరహాలో వీటికి ముందుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మీటర్ల ఏర్పాటు పూర్తయితే రీడర్స్ అవసరం విద్యుత్ సంస్థకు ఉండదు.


నీట మునిగిన ప్రాంతంలో బిల్లు తీస్తున్న రీడర్

లోకేశ్ టీం అని బెదిరిస్తున్నారు



గతంలో ఒక్కో విద్యుత్ మీటర్ రీడింగ్‌కు రూ.3.20 పైసలు ఇస్తుండేవారు. నేడు రూ.2.80 పైసలు మాత్రమే ఇస్తామని బెదిరిస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే తాను లోకేశ్ యువగళం టీమ్ నాయకులమని చెబుతున్నారు. ఈ విషయమై విద్యుత్‌శాఖ అధికారులను అడిగినా ఎలాంటి సమాధానం లేదు. సెప్టెంబర్ నుంచి రీడర్స్ ఖాతాల్లో నేరుగా వేతనాలు ఇవ్వాలని సీఎండీ ఉత్తర్వులు జారీ చేసినా జిల్లాస్థాయి అధికారులు పట్టించుకోవడం లేదు.

– హజరత్‌వలీ, ఏకేనగర్, మీటర్‌రీడర్

23 ఏళ్లుగా పనిచేస్తున్నా..



గత 23 ఏళ్లుగా మీటర్‌రీడర్‌గా పనిచేస్తున్నా. ప్రస్తుతం ఇస్తున్న వేతనాలతో కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలి. ప్రస్తుతం స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో భవిష్యత్తు ఎంటో తెలియడం లేదు. మాకు ఉద్యోగభద్రత కల్పించి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాల్సిన అవసరం విద్యుత్ యాజమాన్యానిదే.

– బాలకృష్ణ, టౌన్‌హాల్ సెక్షన్ రీడర్

క్లుప్తంగా

ఎనీటైమ్ మద్యం

- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు


ఉదయం 8 గంటలకు సాగుతున్న మద్యం విక్రయాలు

నెల్లూరు(క్రైమ్) : కొందరు బార్ నిర్వాహకులు బరితెగించారు. నిబంధనలకు నీళ్లొదిలి 24 గంటల మద్యం విక్రయాలు సాగిస్తూ జేబులు నింపుకుంటున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాల్సిన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు కనీసం అటువైపుగా దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది. బార్ అండ్ రెస్టారెంట్‌లలో నిబంధనల మేరకు ఉదయం 10 నుంచి రాత్రి 11 గంటల వరకు మద్యం విక్రయాలు సాగించాలి. అయితే కొందరు బార్ అండ్ రెస్టారెంట్‌ల నిర్వాహకులు 24 గంటల పాటు మద్యం విక్రయాలు సాగిస్తున్నారు.

సంఘ సభ్యులకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : జిల్లాలోని కోవూరుకు చెందిన గ్రామ సమాఖ్య సంఘ సభ్యులకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను జిల్లా సహకార అధికారి(డీసీఓ) గుర్రప్ప అందజేశారు. నగరంలోని డీసీఓ కార్యాలయంలో కోవూరు 12వ గ్రామ సమాఖ్య, సంఘబంధ సభ్యులకు గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీఓ మాట్లాడుతూ, డీఆర్‌డీఏ నెల్లూరు వారి పరిధిలోని స్వయం సహాయక సంఘాల మహిళలతో ఏపీ మ్యాక్స్ చట్టం 1995ను అనుసరించి సహకార సంఘాలుగా రిజిస్టర్ అయిన సభ్యులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీ

నెల్లూరు(అర్బన్) : స్థానిక మల్లికార్జునపురంలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ, జిల్లా టీబీ నివారణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. టీబీ రోగులకు చేస్తున్న పరీక్షలను పరిశీలించారు. బీసీజీ వ్యాక్సినేషన్‌ను చెక్ చేసి, రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

కంటైనర్ టెర్మినల్ సాధనే లక్ష్యం

- 40 మంది సభ్యులతో కమిటీ


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : జిల్లాలోని కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్‌ను ప్రారంభించే వరకు పోరాటాన్ని సాగిస్తామని రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు నిర్ణయం తీసుకున్నారు. నగరంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో కంటైనర్ టెర్మినల్ సాధన కోసం పలు కార్మిక, ప్రజాసంఘల ఆధ్వర్యంలో గురువారం రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శి దామా అంకయ్య మాట్లాడారు. కంటైనర్ టెర్మినల్‌ను మూసివేయడం తగదని, దీనిపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. టెర్మినల్ మూసివేతతో 10 వేల మంది వీధిన పడ్డారన్నారు. ఈ సందర్భంగా కంటైనర్ టెర్మినల్ సాధన కోసం 40 మందితో కమిటీని ఏర్పాటు చేశామన్నారు. కమిటీ కన్వీనర్‌గా మోహన్‌రావు, కో–కన్వీనర్‌గా దామా అంకయ్యలను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ నేత రాంబాబు, ఆర్ఎస్‌పీ నేత రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక సమస్యపై ర్యాలీ నేడు

నెల్లూరు(బారకాసు) : ఉచిత ఇసుక, భవన నిర్మాణ కార్మికులకు అండగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో జిల్లాస్థాయి ర్యాలీ నిర్వహించనున్నారు. నగరంలోని వీఆర్సీ కూడలి వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం అక్కడి నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తారు. అక్కడ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించనున్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డితో పాటు జిల్లాలోని ఇతర ముఖ్య నాయకులు పాల్గొంటారని, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని పార్టీ నెల్లూరు సిటీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు.

ఆక్రమణల తొలగింపు

నెల్లూరు(బారకాసు) : నగరంలోని మినీబైపాస్ రోడ్డు, అన్నమయ్య సర్కిల్ సమీపంలోని పార్కు ముందు ఫుట్‌పాత్‌ను ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలను కార్పొరేషన్ అధికారులు గురువారం తొలగించారు. గత కొంత కాలంగా కొందరు ఫుట్‌పాత్‌ను ఆక్రమించి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. దీనిని గుర్తించిన టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆక్రమణలను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు వారు ఫుట్‌పాత్‌పై ఉన్న దుకాణాలను తొలగించారు.

అక్రమ కేసులకు భయపడేది లేదు


దర్గామిట్ట పోలీస్‌స్టేషన్ బయట విజయకుమార్‌రెడ్డి, పార్టీ నేతలు

- ఆనం విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు(క్రైమ్) : అక్రమ కేసులకు భయపడేది లేదని, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతామని వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. భవన నిర్మాణ కార్మికులకు సంఘీభావంగా ఈనెల 10వ తేదీన కరెంటాఫీసు సెంటర్‌లో శాంతీయుత నిరసన తెలిపిన వైఎస్సార్‌సీపీ నాయకులపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. కాగా కేసులోని పలువురు గురువారం దర్గామిట్ట పోలీసుస్టేషన్‌కు వెళ్లి నోటీసులు తీసుకున్నారు. ఈ సందర్భంగా స్టేషన్ బయట ఆనం విజయకుమార్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఉచిత ఇసుక పేరుతో ప్రభుత్వం కాలయాపన చేయడం వల్ల భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. దీనిపై వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రూరల్ నాయకులు, కార్యకర్తలు ఈనెల 10న కరెంటాఫీస్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద సంఘీభావం తెలియజేశామన్నారు. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలిగించలేదని, అందుకు అక్కడున్న పోలీసులే సాక్షులన్నారు. అయితే అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన దర్గామిట్ట పోలీసులు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించామంటూ జిల్లా అధ్యక్షుడు, తనతో పాటుగా 26 మందిపై అక్రమ కేసు పెట్టారన్నారు. ఇలాంటి కేసులకు భయపడేది లేదని, పార్టీ నేతలు, కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా అండగా ఉంటామన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి


విద్యార్థులతో మాట్లాడుతున్న అరుణమ్మ

నెల్లూరు సిటీ : పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. జిల్లాలోని చిన్న చెరుకూరులో ఉన్న పాఠశాలను ఆమె గురువారం పరిశీలించారు. పాఠశాల సిబ్బందితో పాటు విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలోని మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అరుణమ్మ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో పాఠశాల పరిసరాల్లో పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను డీఈఓతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు.

రాష్ట్రంలో ఏరులై పారుతున్న మద్యం


నిరసన చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో మద్యాన్ని ఏరులై పారిస్తున్నట్లు ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నా ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా నగరంలో మద్యం దుకాణాలను ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ కార్యాలయం వద్ద గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మున్నా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తక్కువ ధరలకు టెండర్లు వేసి ప్రార్థనా మందిరాలు, నివాసాలు, విద్యాలయాల సమీపంలో మద్యం దుకాణాలను ఏర్పాటు చేయడం దారుణమన్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు షాన్‌వాజ్, నగర సహాయ కార్యదర్శి సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మెడికవర్‌లో ఉచిత కేన్సర్ పరీక్షలు


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మెడికవర్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ సెంటర్ హెడ్ డాక్టర్ బిందురెడ్డి

నెల్లూరు(అర్బన్) : తమ ఆస్పత్రిలో మహిళలకు ఉచిత కన్సల్టేషన్‌తో పాటు బ్రెస్ట్ కేన్సర్‌కు సంబంధించిన 2,800 విలువైన మామోగ్రామ్ లాంటి స్క్రీనింగ్ పరీక్షలను ఉచితంగా చేస్తున్నామని మెడికవర్ సూపర్ స్పెషాలిటీ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ సెంటర్ హెడ్ డాక్టర్ బిందురెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను గురువారం ఆస్పత్రిలో డాక్టర్లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న రోజుల్లో ప్రతి 8 మంది మహిళల్లో ఒకరికి రొమ్ము కేన్సర్ రానున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా వేసిందన్నారు. అవగాహన లేకపోవడం వల్ల, తగిన ముందస్తు పరీక్షలు చేయించుకోకపోవడం వల్లనే ఇండియాలో బ్రెస్ట్ కేన్సర్ రోగులు పెరిగిపోతున్నారన్నారు. మొదటి, రెండో దశల్లో కేన్సర్‌ను గుర్తిస్తే పూర్తిగా నయం చేసేందుకు వీలవుతుందన్నారు. మహిళలు 40 ఏళ్ల తర్వాత రెండేళ్లకోసారి మోమోగ్రఫీ, 50 ఏళ్ల తర్వాత ఏడాదికి ఒక దఫా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రతి మంగళవారం ఉచిత కేన్సర్ వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్, ఇన్సూరెన్స్ వారికి క్యాష్‌లెస్ సేవలందిస్తున్నామన్నారు. సమావేశంలో అంకాలజిస్టులు డాక్టర్ రంగరామన్, డాక్టర్ శ్రీవిద్య, డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ అవినాష్, డాక్టర్ ప్రియ పాల్గొన్నారు.

మున్సిపల్ కళాశాల సందర్శన

నెల్లూరు(బారకాసు) : నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వీఆర్ మున్సిపల్ జూనియర్ కళాశాలను మేయర్ పొట్లూరి స్రవంతి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా సౌకర్యాలపై విద్యార్థులను ఆరాతీశారు. తాగునీటికి ఇబ్బందిగా ఉందని విద్యార్థులు తెలుపగా, సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించారని ఫిర్యాదు

నెల్లూరు సిటీ : కొందరు వ్యక్తులు తన ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి దౌర్జన్యం చేశారని బి.ప్రభావతి అనే మహిళ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. రూరల్ మండలంలోని నాలుగో మైలులో ప్రభావతి నివాసం ఉంటోంది. ఈ క్రమంలో 23వ తేదీన ప్రభావతి తల్లి జ్యోతి, మరో మహిళ సుల్తానా కోసం కొందరు వ్యక్తులు ఆమె ఇంటికి వెళ్లారు. ఆమె ఇక్కడ లేదని, వేరే ప్రాంతంలో ఉంటున్నట్లు సమాధానం ఇచ్చారు. అయితే వారు పట్టించుకోకుండా ఇంట్లోకి దూసుకొచ్చారని, మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు.

విధులకు ఆటంకం కలిగించారని..

ఓ సివిల్ కేసుకు సంబంధించి రాజమహేంద్రవరం జిల్లా కోర్టు న్యాయమూర్తి ఉత్తర్వులు మేరకు నాన్ బెయిలబుల్ వారెంట్‌ను అమలు చేసందుకు రాగా, తమ విధులకు ఆటంకం కలిగించడంతో పాటు, ఫోన్‌ను పగులకొట్టారని రూరల్ పోలీసులకు రాజమహేంద్రవరం జిల్లా కోర్టు న్యాయవాది సంధ్యారాణి ఫిర్యాదు చేశారు. తమ విధుల్లో భాగంగా బుధవారం నెల్లూరుకు వచ్చారన్నారు. నాన్‌బెయిలబుల్ కేసును అమలు చేసే క్రమంలో ముద్దాయి నాలుగో మైలులోని అశోక్‌నగర్‌లో నివాసం ఉంటున్నట్లు సమాచారం అందిందన్నారు. వేదాయపాళెం పోలీసుల సహకారంతో ముద్దాయి కోసం అశోక్‌నగర్‌కు వెళ్లామన్నారు. ఇంట్లోని ప్రభావతితో పాటు ఆమె భర్త, అల్లుడు మరికొందరు ఉన్నారన్నారు. తమ విధులకు ఆటంకం కలిగించే విధంగా ప్రవర్తించారని, తన ఫోన్‌ను ప్రభావతి అల్లుడు పగులకొట్టారని తెలిపారు. అంతటితో ఆగకుండా బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇరువర్గాల ఫిర్యాదులను రూరల్ పోలీసులు స్వీకరించి గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి అన్నారు. ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గురువారం ఆయన మొక్కలు నాటారు. ప్రకృతిని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అనంతరావు, కార్యదర్శి సురేంద్రబాబు, మాజీ అధ్యక్షుడు వేలూరు రంగారావు, బాషం శేషగిరిరావు, కనకట్ల ముదిరాజ్, రఘురాంనాయుడు, బలరాంనాయుడు పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న రాజమోహన్‌రెడ్డి

రాష్ట్రస్థాయి పోటీలకు సౌత్‌మోపూరు విద్యార్థులు



నెల్లూరు సిటీ : రూరల్ మండలంలోని సౌత్ మోపూరు గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికై నట్లు హెచ్‌ఎం అన్వర్ హుస్సేన్ గురువారం తెలిపారు. ఈ క్రమంలో ఎంపికైన విద్యార్థులు కె.శివశంకర్, మహి, నందిని, ప్రియ, నిత్యమాధురి, శ్వేతలను అభినందించారు. పీడీ నాగేంద్రరావు తదితరులు ఉన్నారు.

దుస్తుల పంపిణీ



నెల్లూరు సిటీ : నగరంలోని మెడికవర్ హాస్పిటల్‌కు సమీపంలోని పేద పిల్లలకు పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం దుస్తులు, అల్పాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు రమేష్ మాట్లాడుతూ పిల్లల మధ్య తన కుమార్తె జన్మదినాన్ని జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రియ, వెంకటసూర్య, సాయిరెడ్డి పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి


కలెక్టర్‌కు వినతి పత్రం అందజేత

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : భారత్ సాగర్‌మాల జాతీయ రహదారి నిర్మాణంలో భూములను కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని సీపీఎం కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘ జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య మాట్లాడారు. జిల్లాలోని జాతీయ రహదారి కోసం ఏడు మండలాల రైతుల వద్ద భూములను సేకరించారని, అయితే నామమాత్రంగా నష్టపరిహారం ఇచ్చారన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ ఆనంద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాలే వెంగయ్య, నారాయణ, నగేష్ పాల్గొన్నారు.

జెడ్పీలో కారుణ్య నియామకాలు


జెడ్పీ చైర్‌పర్సన్‌తో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు

నెల్లూరు (పొగతోట) : జిల్లా పరిషత్‌లో మరణించిన ముగ్గురు ఉద్యోగులకు సంబంధించి వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగావకాశాలు కల్పించారు. అందుకు సంబంధించిన నియామక పత్రాలను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ గురువారం జెడ్పీ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, కార్యాలయ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి ప్రణాళికలు

- కమిషనర్ సూర్యతేజ ఆదేశం


అన్నమయ్య సర్కిల్ సమీపంలోని పార్కును పరిశీలిస్తున్న కమిషనర్

నెల్లూరు(బారకాసు) : నగరపాలక సంస్థకు చెందిన ఖాళీ స్థలాల్లో పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. స్థానిక 27వ డివిజన్ రిత్విక్ ఎన్‌క్లేవ్ ప్రాంతంలోని పార్కును కమిషనర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక పార్కుకు సమీపంలో ఉన్న నగరపాలక సంస్థ ఖాళీ స్థలాలను గుర్తించి, వాటిని అభివృద్ధి చేసి ప్రజలకు ఉపయోగపడేలా అందుబాటులోకి తేవాలని సూచించారు. అనంతరం గాంధీనగర్ పార్కు, పినాకినీ అవెన్యూ పార్కు, వేపదొరువు, బాలాజీ నగర్ పార్కులను సందర్శించారు. అన్ని పార్కులను అభివృద్ధి చేసి, అవసరమైన వాటిలో ప్రహరీలు, గేట్ల నిర్మాణాలు చేసి వాచ్‌మెన్‌లను నియమించాని సూచించారు. పార్కుల్లో చిన్నపిల్లలకు ఆహ్లాదాన్ని అందించే మొక్కలు, పచ్చదనం, విద్యుత్ వెలుగులు, ఫౌంటైన్లు, క్రీడా వసతులతో పాటు, వ్యాయామ సామగ్రిని ఏర్పాటు చేయాలన్నారు. గాంధీనగర్ ప్రాంతంలో పారిశుద్ధ్య నిర్వహణ పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గుర్తించి, సంబంధిత సూపర్‌వైజర్, ఇన్‌స్పెక్టర్, కార్యదర్శికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ముత్తుకూరు రోడ్డు కూడలి ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద పచ్చదనాన్ని పెంచి ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. మినీబైపాస్‌లోని నుడా పార్కులో అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి, ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. పార్కును ఆక్రమించుకుని కట్టిన నిర్మాణాలను తొలగించాలన్నారు. ఆయన వెంట ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఎస్ఈ రామ్మోహన్‌రావు, టౌన్‌ప్లానింగ్, శానిటేషన్ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అంకురార్పణ


పవిత్ర జల కలశాలతో శోభాయాత్ర చేపట్టిన భక్తులు


సిద్ధేశ్వరానందభారతి అనుగ్రహభాషణ

నెల్లూరు(బృందావనం) : పప్పులవీధిలోని కుర్తాళం సిద్ధేశ్వరీ పీఠపాలిత గురు దత్తాత్రేయ మఠంలో సౌభాగ్య సరస్వతి అమ్మవారు, పరివార దేవతల విగ్రహ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేక మహోత్సవాలకు గురువారం అంకురార్పణ నిర్వహించారు. కుర్తాళం శ్రీసిద్ధేశ్వరీ పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి సమక్షంలో మహోత్సవాలకు శ్రీకారం చుట్టారు. తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానం నుంచి పవిత్ర పినాకినీ నదీ జల కలశాలతో పప్పులవీధిలోని గురుదత్తాత్రేయ మఠం వరకు శోభాయాత్రను మహిళా భక్తుల ఆధ్వర్యంలో చేపట్టారు. విశేష పూజలను పీఠ ఆస్థాన పండితుడు మాచవోలు రమేష్‌శర్మ, మఠం మేనేజర్ మాచవోలు అనూరాధ పర్యవేక్షణలో నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రమ్యానందభారతి, పత్రి గురురాజా, పాలడుగు సాయి, రాజా శ్రీనివాసరావు, కేవీ శ్రీధర్, కె.మధుసూదన్‌రావు, బి.ఏడుకొండలు, దొంతంశెట్టి వినయ్, జి.లోకేష్‌బాబు, చల్లగుండ్ల మోహన్‌రావు, పచ్చిపులుసు శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

హైందవ ధర్మం ఎంతో విశిష్టమైంది

హైందవ ధర్మంలో ఆలయాలకు ఎంతో విశిష్టత ఉందని, వీటిని ప్రతిఒక్కరు సందర్శించి తమ ఇష్ట దైవాలను పూజించడం ద్వారా వారి అనుగ్రహం పొందితే జీవన గమనం ఎలాంటి ఒడిదొడుకులు లేకుండా సాఫీగా సాగుతుందని సిద్ధేశ్వరానంద భారతి అనుగ్రహభాషణ చేశారు. నగరంలో సౌభాగ్య సరస్వతి అమ్మవారి ప్రతిష్ఠ, అనుబంధంగా ఎందరో పరివార దేవతల ప్రతిష్ఠాపన జరగడం శుభసూచికమన్నారు.